INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN: 2277-7881; IMPACT FACTOR – 6.014; IC VALUE:5.16; ISI VALUE:2.286
VOLUME 8, ISSUE 8(7), AUGUST 2019

వినడం ఓ కళ

డా. రాపోలు శ్రీనివాస్,

తెలుగు సహాయాచార్యులు, తారా ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), సంగారెడ్డి, తెలంగాణా రాష్ట్రం.

సెల్: 9848050694 Email: srinivas.rapolu**42**@gmail.com

వ్యాస సంగ్రహం:

భాషా నైపుణ్యాలైన శ్రవణం, భాషణం, పఠనం, లేఖనాలలో 'శ్రవణం' (వినడం) మొదటిది మరియు భాషా సౌధానికి మూలస్తంభం వంటిదని ఈ వ్యాసం వివరిస్తుంది. మనిషి జీవితం వినడంతోనే ప్రారంభమవుతుందని, ఇది ఒక ముఖ్యమైన భావగ్రహణ నైపుణ్యమని పేర్కొనబడింది. ధ్వనులను, అక్షరాలను ఏకాగ్రతతో వినడం, శ్రవణ లోపాలకు కారణాలను విశ్లేషించడం మరియు మానవ సంబంధాలను మెరుగుపరచడంలో వినడం యొక్క ప్రాముఖ్యతను ఇందులో చర్చించారు. "మాట్లాడేవానికన్నా వినేవాడే వివేకవంతుడు" అనే సూత్రం ప్రకారం, జీవితంలో మరియు ఉద్యోగ రంగంలో విజయానికి మంచి శ్రోతగా ఉండటం ఎంత అవసరమో ఈ వ్యాసం స్పష్టం చేస్తుంది. వినడం కేవలం భౌతికమైన శ్రవణం (Hearing) కాకుండా, శ్రద్ధగా ఆలకించడం (Listening) అని, ప్రాథమిక, మాధ్యమిక మరియు ఉన్నత స్థాయిలలో శ్రవణ నైపుణ్యాలను ఏ విధంగా పెంపొందించుకోవాలో వివిధ సూత్రాలు మరియు మార్గాల ద్వారా విశదీకరించబడింది.

కీలక పదాలు: శ్రవణం – ఊనిక – భావగ్రహణ – వాదప్రతివాదాలు – వినాయకుడు.

ఉపోద్ఘాతం

భావగ్రహణం, భావవ్యక్తీకరణం చక్కగా జరగాలంటే భాషపై కొంత అధికారం అవసరం. ఆ అధికారాన్ని సంపాదించడానికి భాషా నైపుణ్యాలలో శిక్షణ అవసరం. భాషలో సంపూర్ణమైన అధికారాన్ని కలగజేసేవి భాషా నైపుణ్యాలు. ఇవి భాషా సౌధానికి నాలుగు స్తంభాల వంటివి. వీటిలో మొదటిది శ్రవణం. మిగిలినవి భాషణం, పఠనం, లేఖనం.

వినడం

శ్రవణేంద్రియాల ద్వారా జరిగే భాషా ప్రక్రియను శ్రవణం అంటారు. శ్రవణం భాషణంలో స్పష్టతను, నిర్దుష్టతను అలవరచి మంచి ఉచ్చారణ శక్తిని కలిగిస్తుంది. విద్యార్జనలో శ్రవణ నైపుణ్యం ఉత్తమమైంది. మాతృభాషోపాధ్యాయుడు సరియైన భాషను స్పష్టోచ్చారణతో విద్యార్థులు వినే విధంగా ఉచ్చరిస్తూ ఉంటే విద్యార్థులు దాన్ని వింటూ తమ శ్రవణ నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ మంచి భాషను నేర్చుకుంటారు.

ఉద్దేశాలు:

- ధ్వనులను, అక్షరాలను, పదాలను, వాక్యాలను జాగ్రత్తగా వినేట్లు చేయడం.
- ఇతరుల మాట్లాడుతున్నప్పుడు వివిధ ధ్వనుల్ని గుర్తించేట్లు చేయడం.
- స్వరభేదాన్ని, ఊనికనుబట్టి భావాన్ని గ్రహించేట్లు చేయడం.
- ఏకాగ్రతతో విని విషయాన్ని గ్రహించేట్లు చేయడం.
- రణగొణ ధ్వనుల మధ్య కూడా అవసరమైన ధ్వనులనే విని గుర్తింట్లు చేయడం.

శ్రవణ లోపాలకు కారణాలు:

- శ్రవణేంద్రియాలకు సంబంధించిన లోపాలు, చెముడు మొదలయినవి.

- మాట్లాడేవారి కంఠస్వరం తగ్గుస్థాయిలో ఉండడం.
- ఏకాగ్రతతో వినకపోవడం.

శ్రవణం ప్రాముఖ్యత:

భాషా నైపుణ్య భవంతికి శ్రవణమే మూలస్తంభం: భాషా నైపుణ్యాలు నాలుగింటిలో శ్రవణం ముఖ్యమైంది. శ్రవణ నైపుణ్యం మీదనే ఇతర నైపుణ్యాలు ఆధారపడి ఉంటాయి. నిర్దుష్ట శ్రవణం ద్వారా నిర్దుష్ట భాషణం, భాషణం ద్వారా స్పష్టమైన పఠనం, పఠనం ద్వారా నిర్దుష్ట లేఖనాన్ని నేర్చుకొవడానికి వీలౌతుంది. మనిషి జీవితం వినడంతోనే ప్రారంభమౌతుంది.

శ్రవణం భావగ్రహణ నైపుణ్యం: భాషా నైపుణ్యాలలో శ్రవణం, పఠనం భావగ్రహణ నైపుణ్యాలు, నాలుగింటిలో శ్రవణం ముఖ్యమైంది. శ్రవణ నైపుణ్యం మీదనే ఇతర నైపుణ్యాలు ఆధార పడతాయి.

వినడమంటే నేర్చుకోవడమే (హియరింగ్ ఈజ్ లెర్నింగ్): ఎంత బాగా వింటే అంత బాగా నేర్చుకోగలం. వినడం ద్వారానే శిశువు నేర్చుకుంటాడు. విద్యార్థులు వినడం ద్వారానే ఆయా అంశాలను ఆకలింపు చేసుకుంటారు.

మానవ సంబంధాలను పెంచుతుంది: వినడం ద్వారా స్నేహాలు, మానవ సంబంధాలు మెరుగుపడతాయి. కాబట్టి ప్రతిరోజు వినే నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు కొంత సమయాన్ని కేటాయించుకుంటాను. ఇదే నా విజయ రహస్యం అంటాడు ప్రముఖ పారిశ్రమికవేత్త ధీరుభాయి అంబాని. ఎదుటివారి మాటలు వినడం అంటే వారి పట్ల ఆసక్తి, ఇష్టాన్ని కనరచడమే. ప్రేమకు తొలిమెట్టు వినడమే. వినడం ద్వారా ఎదుటి వ్యక్తి తాను ఉన్నత గౌరవం పొందుతున్నానని, తాను మాట్లాడిన దానికి అర్థం ఉందని భావిస్తాడు. ఎదుటి వ్యక్తి చెప్పే విషయం

గురించి మీకు సంపూర్ణ అవగాహన ఉన్నా, వారి అభిప్రాయాన్ని వినడానికి ప్రాధాన్యత ఇచ్చినప్పుడు మీరు వారి దృష్టిలో మరింత ఉన్నతులవుతారు.

విజయ సూత్రం: విజయానికి ముఖ్య సూత్రాలు నాలుగు. 1. తక్కువగా మాట్లాడడం. 2. ఎక్కువగా వినడం, 3. దీర్ఘంగా ఆలోచించడం, 4. ఇతరుల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం.

మాట్లాడేవానికన్నా వినేవాడే వివేకవంతుడు: మాట్లాడడం కంటే వినడం గొప్ప విషయం. వినడానికి సహనం, ఓర్పు, నిగ్రహం కావాలి. అందుకే నోరు తెరవడం కన్నా చెవులు తెరవడం మిన్న. "నేరనన్న వాడు నెఱజాన మహిలోన, నేర్తునన్న వాడు నిందజెందు, ఊరకున్న వాడె ఉత్తమ యోగిరా, విశ్వదాభిరామ వినురవేమ."

శ్రోతకానివాడు మంచి వక్త కాలేడు: శ్రోత మాత్రమే మంచి వక్త కాగలడు. వినడం ద్వారా ఎలా మాట్లాడాలో, ఎలా మాట్లాడకూడదో తెలుసుకుంటాడు. ఏది ఉచితమో, ఏది అనుచితమో తెలుసుకుంటాడు. అవసరమైనంత వరకే మాట్లాడతాడు. అప్రస్తుత ప్రసంగం చేయడు.

వినడమంటే పరిష్కరించుకోవడం: ఓ వ్యక్తి భావాలనుగానీ, సంస్థల విధానాలను అర్థం చేసుకునేందుకుగానీ, సమస్య తీవ్రతను గుర్తించేందుకుగానీ, పరిస్థితులను అవగాహన చేసుకునేందుకుగానీ... ఇలా విషయం ఏదైనా వినడమే పరిష్కారం. జడ్జి వాదప్రతివాదాలు విన్న తరువాతనే తీర్పు చెబుతాడు. అందుకే నాయకుడు బృందంలోని వారి అభిప్రాయాలను, సూచనలను జాగ్రత్తగా వినడం ద్వారానే అర్థం చేసుకోగలుగుతాడు. సమస్యలను పరిష్కరించ గలుగుతాడు. వినడం ద్వారా సమస్య మూలాన్ని అర్థం చేసుకోగలం. మూలం తెలిస్తే గాలం వేయడం సులభం.

మంచిశ్రోత మాత్రమే వినియోగదారుని సంతృప్తి పర్చగలడు: వినడం సరిగ్గా జరగకుంటే అపార్థాలు, భీదాభిప్రాయాలు కలగడానికి అవకాశం ఉంటుంది. కాబట్టే ఈ నైపుణ్యాన్ని అలవర్చుకోవడానికి చాలా సంస్థలు తమ ఉద్యోగులకు శిక్షణ ఇప్పిస్తున్నాయి. మంచి శ్రోత మాత్రమే తక్కువ పొరపాట్లతో ఎక్కువ ఉత్పత్తిని సాధించగలడు. ఉద్యోగులు సృజనాత్మకంగా, వినూత్నంగా పని చేయడానికి వినే నైపుణ్యం దోహదపడుతుంది. గొప్ప విజేతల, నాయకుల, పారిశ్రామిక వేత్తల విజయ రహస్యం ... వారికి గల వినికిడి నైపుణ్యాలే.

ఆలకించడం - వినడం (లిజనింగ్–హియరింగ్): ఆలకించడం అనగా శ్రద్ధ వహించడం. అనగా కథ వినడం కాకుండా ఈ కథ ఎలా చెప్పబడుతుంది? ఎలా పుట్టింది? భాషాప్రయోగం ఎలావుంది? స్వరం ఎలా వుంది? ఎదుటి వ్యక్తి ఒక భావాన్ని చెప్పడానికి తన హావభావాలను ఎలా వ్యక్తం చేస్తున్నాడు? వంటి విషయాలు శ్రద్ధగా అలకించడం ద్వారానే వినగలుగుతాడు.

శ్రవణ పరీక్షలు:

1. 1000+40+1000+30+1000+20+1000+10 = ?
2. మీరు పరుగు పందెంలో రెండో స్థానంలో ఉన్న వ్యక్తిని అధిగమించినచో మీ స్థానం ఎంత?

శ్రవణ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి సూత్రాలు:

- ప్రాథమిక స్థాయిలో బాలగేయాలు, శిశుగీతాలు, హాస్యకథలు, అద్భుత కథలు, నీతికథలు వినిపించడం, పద క్రీడల వంటి కార్యక్రమాలు చేపట్టి వారి శ్రవణ నైపుణ్యం అభివృద్ధి చేయవచ్చు.
- మాధ్యమిక దశలో వేమన, సుమతీ శతకపద్యాలు, దేశభక్తి గీతాలు, పాటలు పాడి వినిపించాలి. వివిధ ప్రసంగాలను వినిపించి ప్రశ్నించాలి.

- ఉన్నత దశలో భారత భాగవత రామాయణాలలోని రసవత్తర పద్యాలు, సంభాషణలను, చర్చలను, సంవాదాలను వినిపించి వాటిపై ప్రశ్నలను అడగడం.

చెప్పకుండా వదిలిపెట్టినవి, అసంపూర్ణంగా ఉన్న వాటిని వినడం: (Known to Unknown) తెలిసిన విషయాల ద్వారా తెలియని విషయాన్ని గ్రహించడం. మంచి శ్రోత వినడంపై శ్రద్ధ చూపడం ద్వారా విన్న విషయాలను ఆధారంగా చేసుకుని వక్త చెప్పకుండా వదిలిపెట్టినవి, అసంపూర్ణంగా ఉన్న విషయాను గ్రహిస్తాడు.

ఎక్కువగా మాట్లాడడం ఆపడం: 'ఎక్కువగా మాట్లాడుతూ తక్కువగా వినాల్సి ఉండి ఉంటే, మనకు రెండు నాలుకలు, ఒక చెవి మాత్రమే ఉండి ఉండేవి' ... అంటాడు మార్క్‌ట్వేన్. వినాయకుడికి చిన్న నోరు, పెద్ద చెవులు ఉండడానికి కారణం ఎక్కువగా వినాలి, తక్కువగా మాట్లాడాలని సూచించడమే.

ఇతరులను మాట్లాడనివ్వడం: ఇతరులు చెప్పేటప్పుడు మనం మాట్లాడవద్దు. వారు ఏమి చెబుతున్నారో వినాలి. కాని మధ్యలో అంతరాయం కలిగించవద్దు. వారు చెప్పింది ఆసాంతం విన్న తరువాత సందేహాలను నివృత్తి చేసుకోవాలి.

సంసిద్ధత: చెబుతున్న విషయంపై దృష్టి పెట్టాలి. పేపర్స్ తిప్పివేయడం, కిటికీ గుండా బయటకు చూడడం, చేతివేళ్ళు విరవడం, మొ. వినడానికి భంగం కలిగిస్తాయి. అంతేకాక మీరు విసుగు చెందుతున్నారనే విషయం వక్తకు తెలియజేస్తాయి.

వక్తకు సహకరించడం: వక్త ఏమి కోరుకుంటున్నాడో తెలుసుకోవాలి. వింటున్నట్లు తల ఆడించడం, శరీరభాగాలను కదిలించడం, వారు చెప్పేమాటల కనుగుణంగా మాట్లాడడం మొ. వక్త చెబుతున్న విషయాలను అర్థం చేసుకుంటున్నట్లు తెలియజేయాలి.

నిష్పక్షపాతంగా వినడం: సొంత ఆలోచనలను తొలగించుకుని వినాలి. మన మనసులోని నిర్ణయాలు, అభిప్రాయాలన్నింటిని పక్కకు పెట్టి నిష్పక్షపాతంగా వినాలి. వక్త చెప్పే విషయాలు, చెప్పే తీరు, వైఖరి శ్రోతకు నచ్చకపోవచ్చు. వక్త తన యాసలో చెప్పవచ్చు. సభాకంపం ఉండవచ్చు. ఇలాంటప్పుడు వక్త ఏమి చెబుతున్నాడనే అంశం మీద శ్రద్ధ పెట్టాలి. కాని ఎలా చెబుతున్నాడనేది చూడవద్దు.

వక్త స్వరంపై దృష్టి: వక్త స్వరం హెచ్చుతగ్గులపై దృష్టిపెడుతూ అతడు దేన్ని వత్తి చెప్పాలనుకుంటున్నాడో గ్రహించాలి.

కన్నులతో వినడం: వక్త చెప్పే విషయాన్ని కేవలం చెవులతో మాత్రమే కాక కన్నులతో వినాలి. మనసుపెట్టి ఆలకించాలి. చెప్పిన మాటల ద్వారా మాత్రమే కాక భావప్రకటన ద్వారా చెప్పదల్చుకున్న విషయాన్ని వినాలి.

వినడం ఒక కళ: వినడం ఒక కళ. అది అంత సులభంగా రాదు. వినడంలో అందం ఉంటుంది. గొప్ప అవగాన ఉంటుంది. మనసు లోతుల్లోంచి విన్నప్పుడు ఎవరి మాటలలోనైనా మాధుర్యాన్ని వినగలుగుతాం. వినడానికి అంతరంగంలో నిశ్శబ్దం, విశ్రాంతితో కూడిన ధ్యానం ఉండాలి.

ఆధార గ్రంథసూచి

ఈ వ్యాసానికి మరియు భాషా నైపుణ్యాలకు సంబంధించి ఉపయోగపడే నాలుగు ప్రామాణిక గ్రంథాల వివరాలు:

1. వేమన శతకము, వేమన యోగి, విశాలాంధ్ర బుక్ హౌస్, విజయవాడ, 2012.
2. సమర్థవంతమైన సంభాషణా నైపుణ్యాలు (Effective Communication Skills), డా. బి. వి. పట్టాభిరామ్, జయ పబ్లికేషన్స్, విజయవాడ, 2018.

3. తెలుగు బోధనా పద్ధతులు (Methods of Teaching Telugu), డా. కే. వి. రామకృష్ణారెడ్డి, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2016.